పింఛన్ కోసం పడిగాపులు



ముంచంగిపుట్టులో పింఛన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది



వనగుమ్మలో పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు



గోమంగి సచివాలయం ఎదుట పింఛన్ కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

అరకులోయ రూరల్/అనంతగిరి/ముంచంగిపుట్టు/హుకుంపేట/పెదబయలు/జి.మాడుగుల/చింతపల్లి రూరల్/కొయ్యూరు/చింతూరు/కూనవరం/వీ ఆర్ పురం/ఎటపాక/రాజవొమ్మంగి/గంగవరం/అడ్డతీగల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ విధానంతో తెల్లవారుజామునే ఇంటి తలుపు తట్టి పింఛన్ సొమ్ము అందించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా చేయడంపై నిస్సహాయులైన పండుటాకులు, దివ్యాంగులు తదితరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ల సేవలను చంద్రబాబు కుట్ర రాజకీయాలతో దూరం చేయడంపై పింఛన్‌దారులు ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. మా జీవితాలతో ఆడుకుంటున్న చంద్రబాబుకు సరైన గుణపాఠం చెబుతామని భీష్మించారు.. పింఛను ఇచ్చేందుకు ఎంత ఎదురుచూసినా ఒకటో తేదీన రావాల్సిన వలంటీర్లు రాలేదు.రెండో తేదీన కూడా రాకపోవడంతో అనుమానం వచ్చి ఆరాతీయగా మూడో తేదీన సచివాలయాల వద్ద ఇస్తారని చెప్పారు. దీంతో వృద్ధులు,, దివ్యాంగులు, అంధులు, వితంతవులు, డయాలసిస్ రోగులు పింఛను సొమ్ముల కోసం ఎంతో ఆశతో మండుటెండలో ఇబ్బందులు పడుతూ ఉదయమే సచివాలయాలకు చేరుకున్నారు. తీరా అక్కడికి వెళ్లిన వారికి సచివాలయాలు ఇంకా తెరుచుకోక పోవడంతో ఎండలో, చెట్ల నీడలో సిబ్బంది కోసం పడిగాపులు కాశారు. ఈ రోజు సొమ్ములు ఇంకా రాలేదు అని చెప్పడంతో అప్పటి వరకు ఉదయం నుంచి మండుటెండలో వేచిచూసిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఉసూరుమంటూ నిరాశతో ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. రాజకీయ లబ్ధికోసం ముదిమి వయసులో ప్రతిపక్షాలు తమను ఇన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, రానున్న ఎన్నికల్లో మా ఓటు ద్వారా వారికి తగిన గుణపాఠం చెబుతామని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో కొన్ని చోట్ల సాయంత్రం తరువాత పింఛన్ల పంపిణీ ప్రక్రియను చేపట్టారు. ఉదయం నుంచి మండుటెండలో వేచి ఉన్న పండుటాకులు పింఛన్ కోసం నానా అవస్థలు పడ్డారు. వలంటీర్ల సేవలు దూరం చేసి చంద్రబాబుకు శాపనార్థాలు పెట్టారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన జగన్‌కే పూర్తిగా మద్దతు ఇస్తామని ప్రకటించారు. చింతూరు, ఎటపాక, అడ్డతీగల, రాజవొమ్మంగి ప్రాంతాల్లో పింఛన్ బట్వాడా జరగలేదు.



అనంతగిరి సచివాలయం నుంచి వెనుదిరిగి వెళ్తున్న పింఛన్‌దారులు



చింతూరు సచివాలయానికి వచ్చి పింఛను రాకపోవడంతో వెనుతిరిగి వెళ్తున్న దివ్యాంగుడు



హుకుంపేటలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



చింతపల్లిలో పింఛన్ కోసం కాలినడకన కర్ర సాయంతో వస్తున్న అవ్వ



దూర ప్రాంతాల నుంచి కాలనడక సింగర్ల సచివాలయానికి వస్తున్న పింఛన్‌దారులు



చినలబుడు పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు



జగనన్న దయ వల్ల గత నెల వరకు ఇంటి వద్దే పింఛన్ అందుకున్నాను.. చంద్రబాబు కుట్ర రాజకీయాల వల్ల వలంటీర్ల సేవలను దూరం చేడయంతో పింఛన్ కోసం అగచాట్లు తప్పడం లేదు. గ్రామానికి 7 కిలో మీటర్లు ప్రయాసం నడుచుకుని అనంతగిరి సచివాలయానికి రావడానికి నరకం చూశాను. మండుటెండలో తీవ్ర ఇబ్బంది పడ్డాను. మా గ్రామం తెనెపుట్టు అక్కడ నుంచి సచివాలయానికి సుమారు 7 కిలో మీటర్లు ఉంటుంది. ఉదయం నుంచి వేచి చూస్తే పింఛన్ సొమ్ము సాయంత్రం వస్తుందని చెప్పారు. చంద్రబాబు రాజకీయాలకు మాలాంటి వారు బలవుతున్నారు. చంద్రబాబుకు గుణపాఠం తప్పదు.

– దేముడు, తెనెపుట్టు, అనంతగిరి మండలం

కాళ్ల నొప్పులతో వచ్చాను



వృద్ధురాలిని కావడంతో నాకు గత రెండేళ్లుగా కాళ్లనొప్పులతో తీవంగా బాధపడుతున్నాను. వలంటీర్ ద్వారా నేరుగా గత నెల వరకు పింఛన్ అందుకున్నాను. ఈనెల పింఛన్ సొమ్ము కోసం జామిగుడ గ్రామం నుంచి రెండు కిలోమీటర్లు మండుటెండలో నడుచుకుని సచివాలయానికి వచ్చాను. అయితే పింఛన్‌సొమ్ము ఇంకా రాలేదని చెప్పడంతో మళ్లీ వెనుదిరిగాను. చాలా ఇబ్బందిగా ఉంది.

– కన్నమ్మ, జామిగుడ, అనంతగిరి మండలం

చంద్రబాబుకు మాపై ఎందుకింత కక్ష



చంద్రబాబు మాకు ప్రతీ నెల ఒకటో తేదీన ఇంటికి వచ్చి వలంటీర్లు అందించే పింఛన్ రాకుండా అడ్డుకున్నారు. మా సొంత బిడ్డగా ముఖ్యమంత్రి జగన్ ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా పింఛన్ అందించారు. కరోనా కష్టకాలంలో మేము ఇంటి నుంచి బయటకు రాకుండా వలంటీర్లు అన్ని విధాలుగా సేవలందించారు. గతంలో చంద్రబాబు పాలనలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. మరలా అదే మనిషి వల్ల ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నాం. మాపై చంద్రబాబుకు ఎందుకింత కక్ష. జగన్ వెంటే మేమంతా ఉంటాం.

– జర్సింగి గాసన్న, రాయిమామిడి గ్రామం

వలంటీర్లను తప్పించడం సరికాదు



జగనన్న పాలనలో వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ సొమ్ము ఇచ్చి వెళ్లేవారు. చంద్రబాబు కుట్ర వల్ల ఇప్పుడు ఓపిక లేకపోయినా 2 కిలోమీటర్లు దూరం మండుటెండలో కాళ్లు ఈడ్చుకొని పెన్షన్ తీసుకోవటానికి రావల్సి వచ్చింది. మాలాంటి వృద్ధులకు ఇదేమి బాధలు. వలంటీర్లను పెన్షన్ పంపిణీ బాధ్యతల నుంచి తప్పించడం సరికాదు.

–కిముడు పందాచారి, వృద్ధుడు,, పొర్లు గ్రామం, జి.మాడుగుల

కుట్ర రాజకీయాలతో ఇబ్బంది



నాకు ప్రతి నెల ఒకటో తేదీన మా వలంటీరు ఇంటికి తెచ్చి పింఛన్ ఇచ్చేవాడు. జగనన్న పుణ్యమా అంటూ నాకు పింఛన్ అందుతుంది. సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలని చెబుతున్నారు. నడవలేను, నిలుచోలేను ఈ పరిస్థితుల్లో నేను వెళ్లి ఎలా పింఛన్ తీసుకోవాలి. చంద్రబాబు కుట్ర రాజకీయాలతో వలంటీర్ల సేవలను దూరం చేయడం దారుణం.

– కుంజం లక్ష్మమ్మ , గంగవరం

పింఛన్ ఎలా తీసుకోవాలి



నాకు కళ్లు సరిగ్గా కనిపించడం లేదు, కాళ్లు సహకరించలేదు, నడవలేని పరిస్థితి..ఇప్పటి వరకు వలంటీర్లు ఇంటికి వచ్చి ఫించన్ ఇచ్చేవారు. ఇప్పుడు ఫించన్ కోసం సచివాలయాలకు వెళ్లాలంటున్నారు.నాలుగు కిలోమిటర్లు దూరం ఎవరి సాయం లేకుండా వెళ్లడం కష్టం. గత చంద్రబాబు పాలనలో పింఛన్‌కు నానా అవస్థలు పడ్డారు. ఇప్పుడు మళ్లీ ఆ పరిస్థితి వచ్చింది. అధికారులు స్పందించి ఇంటి వద్దకే పింఛన్ అందేలా చూడాలి.

–దుక్కిరి గంగమ్, దామనపల్లి పంచాయతీ, జీకే వీధి మండలం

చాలా కష్టంగా ఉంది



గత నెల వలంటీర్లు గడప వద్దే పింఛన్ ఇచ్చారు. ఈ నెల పింఛన్ కోసం కొంతిలి గ్రామం నుంచి 2కిలో మీటర్లు మేరా కాలినడక వెళ్లి గ్రామ సచివాలయానికి వెళ్లాను. ఉదయం నుంచి మండుటెండలో నిరీక్షించాల్సి వచ్చింది. సాయంత్రం 5 గంటలకు పింఛన్ డబ్బులు తీసుకున్నాను. పింఛన్ కోసం సచివాలయానికి రావాలంటే కష్టంగా ఉంది.

– కొర్ర సోములు, కొంతిలి గ్రామం, హుకుంపేట మండలం

అవస్థలు తప్పడం లేదు



ఇలాంటి అవస్థలు వద్దనే చంద్రబాబును ఇంటిలో కూర్చోబెట్టాం. ఇప్పుడు కుట్ర రాజకీయాలతో వలంటీర్ల సేవలను దూరం చేసి మళ్లీ ఇబ్బందులు పెడుతున్నాడు. ఉదయం నుంచి పంచాయతీ కేంద్రంలో పింఛన్ కోసం ఎదురు చూస్తున్నాను. నాకు ఆరోగ్యం బాగోలేదు. పింఛన్ సొమ్ము వస్తే నాకు ఎంతో ఉపయోగపడతాయని ఆశతో వేచి చూస్తున్నాను. నానా అవస్థలు తప్పడం లేదు. వలంటీర్ల సేవలు కొనసాగించాలి.

– పాంగి మోత్తి, వనుగుమ్మ గ్రామం, ముంచంగిపుట్టు మండలం

వలంటీర్ సేవలు దూరం చేయడం దారుణం



పింఛన్ గతంతో ఒకటోవ తేదినే వలంటీర్ ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చేవారు. పింఛన్ పంపిణీలో వలంటీర్ సేవలు మెచ్చుకోవాలి. ఒక సేవా గుణంతో విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి పింఛన్ కోసం నిరీక్షిస్తే సాయంత్రం ఏడు గంటలకు పింఛన్‌ను అందించారు. సచివాలయ సిబ్బంది. వలంటీర్ సేవలను రాజకీయాలతో ముడి పెట్టడం దుర్మార్గం.

– మట్టం సువర్ణ, ముంచంగిపుట్టు

క్లుప్తంగా

డీఎల్‌పీవో ఆకస్మిక తనిఖీలు



గంగవరం సచివాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎల్‌పీవో రాఘవన్

గంగవరం : రంపచోడవరం డివిజనల్ పంచాయతీ అధికారి జి.వి.రాఘవన్ బుధవారం మండలంలో పర్యటించారు. గంగవరం, నెల్లిపూడి గ్రామ సచివాలయాలను బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఇంటి పన్ను వసూళ్ల ఇతర కార్యక్రమాలపై సిబ్బందితో చర్చించారు. కార్యదర్శి కృష్ణస్వామి, సిబ్బంది ఉన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఎటపాక: నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పిలుచుకలపాడులో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై బుదవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ ప్రత్యూష్ వివరించారు. సికిల్‌సెల్ వ్యాధి వారసత్వంగా వస్తుందని వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సల గురించి తెలియజేశారు. హెచ్‌విలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలకు సైన్స్ కిట్లు పంపిణీ



సైన్స్ కిట్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

చింతూరు: మండల కేంద్రం పరిధిలోని 32 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు హైదరాబాద్‌కు చెందిన సమారిటన్ ఫర్ ది నేషన్, హ్యూండయ్ మోటార్స్ గ్రూపు సంస్థల సహకారంతో బుధవారం 40 సైన్స్ కిట్లు పంపిణీ చేసినట్టు చింతూరు ఎంఈవో–2 గుండి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా సమారిటన్ సంస్థ వ్యవస్థాపకుడు రాంకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ కిట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వీటి ద్వారా విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభను వెలికి తీయవచ్చని, వారికి విజ్ఞానం పట్ల ఆసక్తి ఏర్పడుతుందని తెలిపారు.

డ్రాయింగ్ పోటీల్లో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం గోపాలకృష్ణ

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనంలో ప్రతిభ కనపరచారు. ఏపీ స్టేట్ క్రియేటివిటి అండ్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పోటీల్లో 40 మంది పాల్గొన్నారు. వీరిలో నలుగురు గోల్డ్‌మెడల్స్, ఇద్దరు వెండి పతకాలు సాధించినట్టు హెచ్‌ఎం గోపాలకృష్ణ తెలిపారు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేసి అభినందనలు తెలిపారు. డ్రాయింగ్ టీచర్ కొండబాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ వీరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుని విగ్రహ ప్రతిష్ట



వరసిద్ధి వినాయకుడు

రాజవొమ్మంగి: స్థానిక విద్యానగర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం వరసిద్ధి వినాయకుని విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. వేద మంత్రాల నడుమ జరిగిన ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది.

జగనన్నకు మళ్లీ పట్టం కడదాం



గంపరాయిలో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఆనందరావు, నేతలు



కాంగుపుట్టులో గిరిజనులతో పార్టీ శ్రేణులు

పెదబయలు: మండలంలోని గంపరాయి పంచాయతీ చీడిపుట్టు, సుంద్రుపుట్టు, బొయితిల గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షులు వంతాల ఆనందరావు పర్యటించి ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ పేద కుటుంబానికి మరింతగా రెట్టింపు సంక్షేమం అమలు జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లి సీఎంను చేసుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను గెలిపించాలని అభ్యర్థించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కుట్రల వల్ల నేటి మీకు పింఛన్ అందడం లేదని స్పష్టం చేశారు. ఇలాంటి వారిని ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, మాజీ జెడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ, సీకరి సర్పంచ్ గుల్లేలు కృష్ణారావు, మాజీ సర్పంచ్ వంతాల కమలాకర్, మండల నాయకులు అనంతరావు,కొర్రా కనకరాజు వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని రాప పంచాయితీ ఇరుకురాయి, ఈదులగరువు, టింద్రాయి, దాలింపుట్టు, కాంగుపుట్టు గ్రామల్లో మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు పర్యటించారు.



మాట్లాడుతున్న సర్పంచ్ పిట్టా రామారావు

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి కిల్లో రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొండలరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు శోభ ధర్మయ్య దొర, నాయకులు కోరాబు వెంకట్, చప్పలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ పురం: మండలంలోని దర్భలంక గ్రామంలో బుధవారం చినమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సుపరిపాలనను అందించిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. నాయకులు జయరాజ్, ముత్యాల రావు, నాగేశ్వరరావు, లక్ష్మణరావు, రాజబాబు, రమేష్ , దుర్గరావు తదితరులు పాల్గొన్నారు.

గణితంపై పట్టు సాధించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాగరాజు

పెదబయలు: పెదబయలు, ముంచంగిపుట్టు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు గణిత శాస్త్ర సూత్రాలు, ఇతరత్రా విషయాలపై వేదిక్ మ్యాథ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ మేనేజర్ బి.నాగరాజు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక తరగతుల నుంచి విద్యార్థులు గణితంపై అవగాహన పెంచుకుంటే మంచి మార్కులు సాధించడంతో పాటుగా ఉన్నత శిఖరాలు అందుకోవచ్చన్నారు. గణితంపై భయం వీడి, సాధనపై దృష్టి సారించాలన్నారు. లెక్కలు సులువుగా చేసే పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు కె.కేశవరావు, ఈశ్వరమ్మ తదితరులు గణిత విశ్లేషకుడు నాగరాజు అందిస్తున్న సేవలను కొనియాడారు.

ఓటు వేయడం సామాజిక బాధ్యత



ర్యాలీలో మాట్లాడుతున్న తహసీల్దార్ నజీముల్లాషా



కిమ్మిలిగెడ్డలో అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యశాస్త్రి, తహసీల్దార్ సత్యనారాయణ

చింతూరు: ఓటు ఎంతో ప్రధానమైనదని, ఓటు వేయడం సామాజిక బాధ్యతని చింతూరు తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా బుధవారం చింతూరు మెయిన్ రోడ్‌లో వివిధ శాఖల సిబ్బందితో మానవహారం చేపట్టంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో బలమైనదని, దీని ద్వారా మన భవిష్యత్తును నిర్ణయించుకునే అవకాశముందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఓటు వినియోగంపై వారు ప్రజలకు అవగాహన కల్పించారు. సెక్టోరల్ అధికారి దుర్గాప్రసాద్ సీడీపీవో విజయగౌరి, ఏపీఎం నాయుడు, బూత్‌లెవల్ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట, అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, బడదనాంపల్లి, చినరెల్లంగిపాడు, గొబ్బిలమడుగు, చీడిపాలెం గ్రామాల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్, రంపచోడవరం) డి.సుబ్రహ్మణ్యశాస్త్రి బుధవారం పర్యటించారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సుల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈవీఎంల పనితీరును వివరించారు. తహసీల్దార్ డి.వి.సత్యనారాయణ, బీఎల్‌వో భూలక్ష్మి తదితరులున్నారు.

నాటు తుపాకీల అప్పగింత



నాటు తుపాకీలను చూపిస్తున్న పోలీసులు

చింతపల్లిరూరల్: లైసెన్స్ లేని నాటు తుపాకీలను గిరిజనులు స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించినట్టు అన్నవరం ఎస్ఐ రాజారావు తెలిపారు.మండలంలో బలపం పంచాయతీ పరిధిలో పలువురు గిరిజనులు వేట కోసం ఉపయోగిస్తున్న ఏడు నాటు తుపాకులు బుధవారం తమకు స్వాధీనం చేశారన్నారు.ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 17 నాటు తుపాకులు గిరిజనులు స్వచ్ఛందంగా అప్పగించినట్టు చెప్పారు. ఇంకా ఎవరి వద్దనైనా లైసెన్స్‌లేని నాటు తుపాకులు, ఆయుధాలు ఉంటే స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించాలని ఆయన తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కూనవరం: గిరిజన బాలికల గురుకుల పాఠశాల(కోతులగుట్ట నందు) 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వాణి బుధవారం తెలిపారు. దరఖాస్తులకు ఆఖరి గడువు ఈనెల 10వతేది అని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, 4వ తరగతి చదివిన స్టడీ సర్టిఫికెట్, తల్లీ లేక తండ్రి ఫోన్ నంబర్ తప్పనిసరిగా పొందుపరచాలని తెలిపారు. 5వ తరగతి ఇంగ్లీషు మీడి యం సీట్ల వివరాలు ఎస్టీ–59, ఎస్సీ–10, బీసీ–4, ఓసీ–2, ఏయుక్యూ–2, పీహెచ్‌సీ(ఎస్టీ)–2. పీటీజీ–1 మొత్తం–80 సీట్లు ఉన్నట్టు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

జి.మాడుగుల: అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ రమేష్ తెలిపారు. మండలంలో గల వర్తక సంఘం సభ్యులు, వ్యాపారస్తులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోను, మెయిన్ రోడ్లలోను వీధిలైట్లును తప్పనిసరిగా వెలిగించేందుకు పంచాయతీకి వర్తక సంఘం తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. సీసీ కెమెరాలను రికార్డు చేసేందుకు గాను అవసరమైన చోట్ల వీధిలైట్లు కూడా తప్పనిసరిగా ఉండాలన్నారు. అన్ని షాపులు రాత్రి 9గంటల తరువాత మూసివేయాలని, రహ దారులపై సంచరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచ్ కిముడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.